# అసతోమా సద్గమయ

దీపావళి మర్నాడయితే ఆనాడు నరకచతుర్దశి.


తెల్లవారుఝామున లేవడానికి బద్ధకించిన పిల్లలుకూడ జిలేబీలు, జంతికలు, టపాకాయల ఆశకు గబగబా లేచి తలంట్లు పోయించుకున్నారు. క్రొత్తబట్ట లేసుకుని, తీపీ, కారం తొందరగా తినేసి అమ్మాయిలు తీగ పువ్వొత్తులు, అబ్బాయిలు సీమటపాకాయలు తీసుకుని వాకిళ్ళలో చేరి సద్దు మొదలెట్టారు తెలతెలవారుతూ వుండగానే.

అలవాటు ప్రకారం నాలుగ్గంటలకే లేచిన దండపాణి హాల్లో పడక్కుర్చీలో చేరబడ్డాడు. చేత్తో నుదురు, కళ్ళు

---

విజయలక్ష్మి

---



కప్పుకొని తనలో తనుగా వుండిపోయ్యాడు. కాఫీగ్లాసు పట్టుకువస్తున్న శాంతమ్మ టపాకాయలచప్పుడు విని తల్లడిల్లిపోయింది. బెదురుగా చూసింది భర్తవంక; ఆయనా చూశాడు ఆమెవంక. ఆపుకోలేక బావురు మంటూనే కాఫీగ్లాసు భర్తచేతి కందించింది శాంత. గ్లాసు కింద పెడుతూ ''కూర్చో, తప్పు, ఏడవ కూడదు శాంతా; యితరులనుచూసి ఏడవడం చాలా చెడ్డపని'' అన్నాడు గొంతులో సుళ్లు తిరుగుతున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ.

శాంత దుఃఖం తీవ్రమైంది. "అయ్యయ్యో, ఏమి టట్లా అంటారు మీరు? తెలిక చేసిం దానికి అనుభవిస్తున్నాను, తెలిసి పాపం వూహించలేను నేను. పోగొట్టుకున్నదాన్ని, పట్టలేక ఏడ్చాను. ఇతర్లను చూసి ఏడవ లేదండీ! మీరే నన్నిట్లా అనుకుంటే ఏమై పోతాను నేను" అంటూ భర్త కాళ్ళదగ్గర నేలమీదనే చతికిలబడిపోయి కొంగులో ముఖం దాచుకుని ఎక్కిళ్లుపడింది శాంతమ్మ.

నోరు విప్పితే గొంతులో గడ్డకట్టుకున్న దుఃఖం వెలికి వస్తుందనే భయంతో కాసేపు మెదలకుండా వుండిపోయాడు దండపాణి. తర్వాత పెగల్చుకుని "శాంతా ఏడవకు. నేను దుర్బలుణ్ణి, నిన్ను ఓదార్చే శక్తి నాకు లేదు. నా ఎదుట ఏడవకు శాంతా, ఏడవకు. నేను చూడలేను. నేను పిచ్చివాణ్ణయి పోతాను. నీకు తెలీదు, నాకు భయంగా వుంది" అన్నాడు. కొరడాదెబ్బ తగిలినట్లు తలెత్తి భర్తను చూచింది శాంత. కళ్ళు తుడుచుకుని కాఫీ చేతికందిస్తూ "కాఫీ తీసుకుని స్నానానికి రండి, తర్వాతే డైనా వ్రాసుకుందురుగాని ఎప్పుడేనా యిట్లా వూరికే కూర్చోడం అలవాటుందా మీకు?'' అని లోపలికి వెళ్ళిపోయింది. భార్య భర్తనుంచి ఓదార్పు, సానుభూతి ఆశించడం సహజం. కాని ఖర్మ వశాత్తూ ఆ మగవాడు మహా సుకుమారమైన మనసు కలవాడైతే ఆ ఆడది ఓదార్పు కోరుకోకూడదు, సరికదా, ఎంతటి దుఃఖం లోపల్లోపల దహించివేస్తున్నా, తను ఏడవకుండా ఎదుట నున్న మగవాడు ఏడవకుండా చూచుకోవాలి. శాంతమ్మకు అదే పరిస్థితి ఎదురయింది.

దైవం ప్రతికూలించకపోతే దండపాణి యింట్లో కూడ టపాకాయల చప్పుడు విని పించేవుండేది ఆ దీపావళికి. కాని ఆ భాగ్యం వాళ్ళు అంతకు మూణ్ణెళ్ళ ముందే కోల్పోయారు. ఎనిమిదేళ్ళ కొడుకు రామానుజం, ఆరేళ్ళ కూతురు లీలావతి డిఫ్తీరియా సోకి ఒక వారంలో రెండు రోజులఎడంగా వాళ్ళ గోలీలు, బొమ్మలు, పలకలు, పుస్తకాలు విడిచిపెట్టి ఇంకెక్కడెక్కడో పుట్టడానికి వెళ్ళిపోయారు. శాంత పిల్లల్ని మోసింది, కన్నది, పెంచింది, ప్రేమించింది. వాళ్ళ మీద పెంచుకున్న మమతే ఆమెకు సంపూర్ణ తృప్తి నిచ్చేది. వాళ్ళనుంచి ఏమైనా కోరుకోవాలన్న వూహేకలగలేదు ఆమెకెప్పుడూ. ఏమీ ఆశించలేదు ఆమె తన సంతానాన్నించి. కాని ఆమె భర్త అంతంత చిన్న పిల్లల మీద ఎంతెంత పెద్ద ఆశయాలూ, కోరికలూ పెంచుకున్నాడో తెలిసి ఆమెకు ఒక్కసారి ఆశ్చర్య మయ్యేది; నవ్వు వచ్చేది; కోపం కూడా వచ్చేది. ఏడాదినాడు జరిగిన సంఘటన ఆమె ఎప్పటికీ మర్చిపోలేదు.

ఐదేళ్ళ లీల ఏ యింట్లో తల్లి బిడ్డకు స్నానంచేయిస్తుంటే చూసి వచ్చిందోఏమో, హాలు నడాన కాళ్లు చాపుకు కూర్చుని చందనపుబొమ్మను కాళ్ల మీద పెట్టుకుని లక్క పిడతతో నీళ్లు పోస్తూ ఆడుకుంటున్నది. అప్పుడే కాలేజి నుంచి వచ్చిన దండపాణి ఆ దృశ్యం చూచి ఉగ్రుడయిపోయాడు. బిగ్గరగా కేకేసి పిలిచాడు భార్యని. ఏమిటంటూ వచ్చింది శాంత. "చూశావా నీ కూతుర్ని" అన్నా డాయన. అప్పటికి లీల నీళ్లు పొయ్యడం ముగించి బొమ్మను తన గౌను తోటి తుడుస్తోంది. తల్లి కూతురివంక మురిపెంగా చూచి చిన్నగా నవ్వుతూ, భర్త వంక చూచింది. "నవ్వుతున్నావా నువ్వు? నవ్వెట్లా వస్తుంది నీకు? ఇదిగో వార్నింగ్ యిస్తున్నా నీకు, పిల్లల్ని యింట్లా పెంచావంటే వూరుకోను నేను. వాళ్ళ మీద పెట్టుకున్న ఆశ లేమిటి? నువ్వు వాళ్ళను పెంచే తీరేమిటి? పిల్లలకు నీళ్లు పొయ్యడం ఏ ఆడదానికీ చేతకాక పోదు. దాన్ని బట్టి ఆడపిల్లగా పెంచకు. వాళ్ళ మీద ఎంత ఆశ పెట్టుకుని ఆ పేర్లు పెట్టాను నేను! నా విద్య నాకు వూపిరి. నేను సాధించలేని పాండిత్యం వాళ్ళు సాధించాలి. మళ్ళీ నేను భాస్కరాచార్యుల వంటి అదృష్టవంతుణ్ణి కావాలి. అది జరగని నాడు నాకు వీళ్ళమీద ఏ మమతా వుండదు. వాళ్ళు వున్నా ఒకటే, లేకపోయినా ఒకటే" అన్నాడు. భర్త మాటలకు ఒళ్ళు మండింది శాంతకు. ఏ పాపపు వేళను ఆయన ఆ మాట అన్నాడో, ఏడాది తిరక్కుండానే వున్న యిల్లు కాస్తా, లేని యిల్లయి పోయింది. బడి లేని ఆదివారం పిల్లలు వంటింట్లోచేరితే "వీళ్ళతో కాసేపాడుకోండి, నా పని తెమలడంలేదు యిక్కడ" అనేది భర్తతో శాంత, ఫక్తు మధ్య తరగతి గృహిణి లాగే! "ఓ అట్లాగే" అని "రండిరా, రామూ, లీలా; యిక్కడరండి, మనం ఆడుకుందాం" అనేవాడు ఆయన. వాళ్ళు వచ్చాక ఇద్దర్నీ చెరియొక వేపూ నేలమీదే కూర్చోమనేవాడు.

" ఇదిగో లీలా, యివాళ ఏం గౌను వేసుకున్నావ్, చుక్కల గౌనా? భేష్, మరి మీ అమ్మ వంటయ్యేవరకు మనం ఆడుకుందాం, ఏం! నే నేమో వ్రాసుకుంటాను, నువ్వేమో నీ గౌనుమీద చుక్కలు లెక్క పెడుతూండు, ఏరా రామూ నీ షర్టుమీద గళ్ళున్నాయా, ఏం! ఇవాళ తెల్లషర్టు వేసుకున్నావ్; సరే యిట్లారా" అని ఓ గ్రాపు కాయితం చేతి కిచ్చి "దీంట్లో గళ్ళన్నీ లెక్క పెట్టి చెప్పాలి మన ముగ్గురికీ పందెం. నేను ముందర వ్రాస్తానో, నువ్వు ముందర గళ్లు లెక్కపెడతావో, మరి లీల చుక్కలు లెక్కపెడుతుందో" అని మళ్ళీ ఆయన తన పుస్తకాల్లో మునిగిపోయేవాడు. పిల్లలిద్దరు ఒకరిముఖం ఒకరు చూసుకుంటూ కిక్కురు మనకుండా చుక్కలూ, గళ్ళూ లెక్కపెట్టేవారు, వాళ్ళమ్మ

భోజనానికి పిలిచేవరకూ. భర్తకు పిల్లలకు ఒకసారే వడ్డించేది శాంత.

భోంచేస్తూ, ''అమ్మా యింకో అప్పడం'' అనేది లీల.

"లీలా నువ్వెన్ని అప్పడాలు తింటావు" అనడిగేవాడు తండ్రి కూతుర్ని.

"రెండు ' అనేది లీల.

"నువ్వురా?" కొడుకు నడిగేవాడు.


"రెండు'' అనేవాడు రాము.

"అబద్ధాలు, మూడుకు తక్కువ ఎప్పుడూ తినడు అన్నయ్య" అనేది లీల.

భార్యాభర్త లిద్దరు నవ్వుకునేవారు. "సరే, రాముకు మూడు, నాకు మూడు, మీ అమ్మకి ఒకటిచాల్లే, నీకు రెండు ; మరయితే మనం దరికి కలిపి మీ అమ్మ ఎన్ని అప్పడాలు వేయించాలి? నేను పెరుగు కలుపుకునే లోపల చెప్తే ఇవాళ నీకు ఐస్‌క్రీం!" అనేవాడు దండపాణి, కూతురికి భోజనం పీట మీదకూడ లెక్కలు నూరిపోస్తూ.

ఆతర్వాత ఐదేళ్ళ లీలకు వాళ్ళమ్మను యింకో అప్పడం అడగాలనిపించినా, వాళ్ళ నాన్న మళ్ళీ ఏమిలెక్క అడుగుతాడోనని భయపడి మానేసేది. ఆరోజులు వెళ్లిపోయాయి, ఆ పిల్లలు వెళ్ళిపోయారు.

తర్వాతెప్పుడైనా భర్త గతాన్ని తవ్వుకుంటున్నట్లు కనపడగానే శాంత "ఏమైనా చదువుకోకపోయారూ" అనో, "వ్రాసుకోకపోయారూ'' అనో అతని ధ్యాస మళ్ళించేది. రానురాను పుస్తకాలుతప్ప యింకో ప్రపంచం లేకుండా పోయింది దండపాణికి. అప్పుడప్పుడు తన పొడారిపోయిన జీవితం తల్చుకు నిట్టూర్చినా, వెంటనే తనకు తానే ఓదార్చుకునేది శాంతమ్మ. ఆ ఏడాది యూనివర్సిటీ ఫిజిక్సు ప్రొఫెసరు రిటైర్ కాగా, ఆయన కుర్చీ దండపాణికి వచ్చి, డాక్టర్ దండపాణి, ప్రొఫెసర్ దండపాణి అయ్యాడు. గామా కిరణాల్లో పరిశోధన చేస్తూ ఆఏడు ఓ క్రొత్త విషయం కనుక్కున్నాడు దండపాణి. కనుగొన్నది ఒక సిద్ధాంతంగా రూపొందించి దానిని "పాణి ఎఫెక్టు"




అంటూ పబ్లిష్ చేసాడు. అది ప్రకటితమయ్యాక అన్ని దేశాలనుంచి విమర్శిస్తూ, సమర్థిస్తూ అనేకవ్యాసాలు అనేక పత్రికల్లో వెలువడ్డాయి. కాని ఏ శాస్త్రజ్ఞుడూ "పాణి ఎఫెక్టు'' ను సహేతుకంగా ఖండించక పోవడంతో దండపాణి పేరు శాస్త్రజ్ఞుల లోకంలో సుప్రతిష్ఠత మైపోయింది. జీవితంలో తను "తలచుకున్నది సాధించా ననే" తృప్తి దండపాణిని మళ్ళీ మనుష్యుల్లో పడవేసింది. పురుషులకు వాళ్ళ సమర్థత, తెలివితేటలమీద ఏర్పడే గర్వం, స్త్రీలకు జీవితంలో వాళ్ళకు లభించిన ప్రేమవల్ల కలిగే గర్వంకన్న మంచి టానిక్స్ ఏమీవుండవు. శాంతకు భర్తనుగురించినబెంగ పోయింది.

ఓనాటి మధ్యాహ్నం దండపాణి ఏదో చదువుకుంటున్నాడు పడుకుని. "ఎవరో అబ్బాయి మిమ్మల్ని చూడా లంటున్నాడు'' అన్నది శాంత వచ్చి. ''యిక్కడికే రమ్మందూ, నేను రాలేను" అన్నాడు దండపాణి. శాంతమ్మ దారి చూపెట్టగా ఆగంతకుడు ప్రొఫెసర్ గారి పడగ్గదిలోకి వచ్చాడు. "అట్లా కూర్చో" అని కుర్చీ చూపించి "ఏమిటి పని" అన్నట్లు చూశాడు దండపాణి ఆ అబ్బాయి వంక. శాంతమ్మ కుతూహలంగా అక్కడే యింకో కుర్చీలో కూర్చుంది. ఆ వచ్చిన అబ్బాయికి తన గురించి ఎట్లా చెప్పుకోవాలో తెలియక తికమక పడ్డాడు. శాంతమ్మ అది గ్రహించి "నీ పేరేమి టయ్యా? ఏమి చదువుతున్నావు'' అనడిగింది. ఆ అబ్బాయికి వూపిరి సల్పింది. త్వర త్వరగా ''నా పేరు కృష్ణమూర్తి, హిందూ కాలేజిలో చదువుకుంటున్నానండి. పరీక్ష ఫీజు కట్టడానికి యివాళ ఆఖరిరోజు. ఇంటిదగ్గరనుంచి మనియార్డరు రాలేదు. రెండు మూడు రోజుల్లో వస్తుం దనుకుంటాను; రాగానే యిస్తాను. ఇవాళ మీరు సర్ది సాయం చెయ్యగలరేమో నని అడగటానికి వచ్చాను" అన్నాడు.

"నా పేరు ఎవరు చెప్పారోయ్ నీకు" అన్నాడు దండపాణి.

"స్టూడెంట్సు చెప్పారండీ. తెలివిగల విద్యార్థులు చాలమందికి మీరు సాయం చేసినట్లు విన్నాను. అందుకు సాహసించివచ్చాను" అన్నాడు.

దండపాణి నవ్వి "ఓ, ఐతే నిన్ను తెలివిగల వాడవిగా నువ్వే లెక్కేసుకున్నా వన్న మాట. చూద్దాం ; వాళ్ళు చెప్పిందీ రైటే.

అపాత్రులకు, అంటే, తెలివితక్కువవాళ్ళకు సాయం చేసే అలవాటు లేదు. నువ్వు పరీక్షకు కూర్చుని పాసవుతావని నాకు తోస్తే సాయం చేస్తాను. నాకు స్టూడెంట్సుకు అప్పు యిచ్చే అలవాటు లేదు. మరి నీకేమీ స్కాలర్ షిప్ లేదూ?" అనడిగాడు.

''వుండేది. ఆ మధ్య కాలేజిలో సమ్మె జరిగింది. అందులో నేను వున్నానమకుని నా స్కాలర్‌షిప్ తీసేసారు. 'సమ్మెకు నా సానుభూతి లేదు. వందలమంది స్టూడెంట్సు దారి కడ్డమయితే కాలేజికి రాలేక పోయాను' అని చెప్పాను. అయినా ప్రిన్సిపాల్ క్షమార్పణ వ్రాసివ్వమన్నారు. నేను యివ్వలేదు, నా స్కాలర్‌షిప్ పోయింది.'' అన్నాడు.

"ఆమధ్య ఎవరో కాని లెక్చరర్‌ను తీసెయ్యాలంటూ స్టూడెంట్సు అల్లరి చేశారు; ఆ స్ట్రయికేనా? పోనీ ఏదో వ్రాసివ్వక పోయావూ?" అన్నది శాంతమ్మ.

ఆఅబ్బాయి మొహమాటపడ్తూ "చెయ్యని తప్పును చేసినట్లు ఒప్పుకోలేకపోయ్యానండీ" అన్నాడు.

దండపాణి సంతోషించాడు ఆ అబ్బాయి మనశ్శుద్ధికి

''సరే – యీ ప్రాబ్లెం చేసిచూపించు,'' అంటూ ఓకాయితం అందించాడు. ఆ అబ్బాయి పదినిముషాల్లో ఆ లెక్కచేసి చూపించాడు. దండపాణి మరి రెండు చెయ్యమన్నాడు. చేసి చూపెట్టాడు కృష్ణమూర్తి. ప్రొఫెసర్ ప్రసన్నుడై ''యిదెట్లా చేసావోయ్. యిది మీ బి. యస్సీ. వాళ్ళకు చెప్పరే!'' అన్నాడు.

"మా అన్నయ్య మేధమిటిక్స్ యం. యస్సి. పాసయ్యాడండి. ఒక ఇంగ్లీష్ కంపెనీలో క్లర్కుగా వుంటున్నాడు. ఆయనకు, తనకు వచ్చిందంతా నాకు చెప్పడం హాబీ అండి'' అన్నాడు.

"ఔనౌను. అటువంటి సబ్జెక్టుకు యిటువంటికాలం వచ్చింది. రామానుజం కూడా ఆయన సగం జీవితం గుమాస్తాగా గడిపాడు. కాని ఒక షరతు నీకు. బి. యస్సి. అయ్యాకను ఎక్కడా గుమాస్తాగా చేరకూడదు. నీ చదువు బాధ్యత అంతా నాది. నువ్వు ఏ హాస్టల్లో వుండనక్కరలేదు. పరీక్షలయ్యాక ఊరెళ్ళి మీ అన్నయ్యకు చెప్పి ఒక వారముండి రా చాలు; యిహ మా యింట్లోనే వుందుగాని" అన్నాడు దండపాణి.

కృష్ణమూర్తిముఖంలో వెన్నెల విరిసింది. దండపాణి వంటి శాస్త్రజ్ఞుని ఆశ్రయం దొరకడం తన అదృష్టం అనుకున్నాడు.

కృష్ణమూర్తి రాకతో శాంతమ్మలో ఘనీభవించిపోయిన మాతృత్వం మళ్ళీ ప్రవహించసాగింది. బిడ్డలు లేని కొరతను కోల్పోయిందామె. తల్లిదండ్రుల కోల్పోయిన కృష్ణమూర్తికి ప్రొఫెసరు దంపతులు యశోదానందులే అయ్యారు. తర్వాత ఐదేళ్ళకు కృష్ణమూర్తి దండపాణి సబ్జక్టులోనే డాక్టరేటు తెచ్చుకున్నాడు. పొంగిపొర్లే సంతోషాన్ని ప్రదర్శిస్తూ దండపాణి యూనివర్శిటీలో పనిచేస్తున్నవాళ్ళందర్నీ పిలిచి ఘనంగా విందు చేశాడు. విందు తర్వాత అందరూ వుండగానే కృష్ణమూర్తికి దండపాణి ఓ బహుమతి యిచ్చాడు. కృష్ణమూర్తి సహాధ్యాయులు కుతూహలపడ్డారు, అదేమో చూడ్డానికి. విప్పి చూసి ఆశ్చర్యపోయారు. తెల్ల కాయితాల లెటర్‌పాడ్స్ రెండు, కాయితాలపైన స్వస్తిక్ ఆకారంలో ముద్రించి వున్నాయి రెండు సూక్తులు – 'అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ'. కృష్ణమూర్తి సాభిప్రాయంగా దండపాణి వంక చూచాడు.

దండపాణి మందహాసంతో "ఔను కృష్ణా! అదే నా ఆశీర్వాదం నీకు! నిజమైన శాస్త్రజ్ఞుడివిగా బ్రతుకు! ఆ రెండు సూక్తులు నీ ఆదర్శాలుగా ఎప్పుడూ గుర్తుంచుకో. నిర్భయంగా తలెత్తి బ్రతుకు!" అన్నాడు దండపాణి.

ఆ ఏడాది కెమిస్ట్రీ డిపార్ట్‌మెంటులో రీడరుగా పూనా నుంచి కర్మార్కర్ వచ్చారు. ఆయనకూ దండపాణికీ మంచి స్నేహమయింది. కర్మార్కర్ ఏకైక పుత్రిక లత. తండ్రితో దండపాణి యింటికి వస్తూ పోతుండేది. వచ్చినపుడల్లా ఆ పిల్ల కళ్ళు కృష్ణమూర్తి కోసం వెదికేవి. కూతురి మనసు గ్రహించిన కర్మార్కర్ ఓ మంచి రోజు చూసుకుని దండపాణి దగ్గర సంగతి కదిలించాడు. దండపాణి మొదట తెల్లబోయినా, తర్వాత సంతోషించాడు. ఫోంచేస్తూ కృష్ణమూర్తితో చెప్పాడు. కబురు విని కదిలిపోలేదు కృష్ణమూర్తి. తల్లి లేని అమ్మాయి, తండ్రి గారాబంతో ఒంటరిగా పెరిగిన అమ్మాయి – అటువంటి భార్యను భరించేవాడికి చాల ఓర్పూ, డబ్బూ తీరుబడీ వుండాలి. 'తనకు మించిన పని' అనుకున్నాడు కృష్ణమూర్తి. "మన కొద్దులే బాబాయ్" అన్నాడు.

కాని దండపాణి విడువలేదు. "ఉహుం, అలా అనకు, ఆలోచించు. ఆడపిల్లలు చదువుకున్నా, హిస్టరీలోనో, లిటరేచర్లోనో లేక బాటనీలోనో లేకపోతే హోంసైన్సులోనో డిగ్రీలు తెచ్చుకుంటారు; గాని ఫిజిక్సు చదివే అమ్మాయిలు తక్కువమంది వుంటారు. లత 'వైర్లెస్'లో యం. యస్సి. పాసయిందట. వచ్చిన అవకాశం వదులుకున్నావంటే, ఆ తర్వాత మీ పిన్ని, వదిన కలిసి ఏ మెట్రిక్ తప్పిన అమ్మాయినో కుదురుస్తారు నీకు!" అన్నాడు దండపాణి.

ఆ పరిస్థితిలో ఏమీ ఆలోచన లేకుండానే అప్రయత్నంగా "సరే, మీ యిష్టం! బాబాయ్" అన్నాడు కృష్ణమూర్తి.

పెళ్ళయ్యాక వేరే క్వార్టర్సు తీసుకొని క్రొత్త యింటికి క్రొత్త భార్యతో తరలి వెళ్లాడు కృష్ణమూర్తి. కృష్ణమూర్తి కాలేజి నుంచి ఆలస్యంగా వచ్చిన రోజల్లా నిష్ఠూరాలాడేది లత. రెండుమూడుసార్లు మెదలకుండా వూరుకున్న కృష్ణమూర్తి నాలుగోసారి "పూనాలో నిన్ను యింట్లో విడిచి మీ నాన్నగారెట్లా వుద్యోగం చేసేవారు లతా?" అనడిగాడు.

ఆమె రోషంగా "అప్పుడా సమస్యే లేదు. నాన్నతోపాటు నేనూ కాలేజీకి వెళ్లేదాన్ని కదా" అంది.

"యిహనేం ! పిహెచ్. డి. కి రిజిష్టరు చేసుకుని నువ్వూ రోజూ కాలేజీకి రా. దాంతో నీ సమస్య తీరుతుంది" అన్నాడు కృష్ణమూర్తి.

వెంటనే ఒప్పేసుకుంది లత. రోజూ భర్తతోపాటు కాలేజీకి వెళ్ళిరావడం సరదాగానే వుండేది లతకు. దాంతో యిల్లు గాలికి వదిలేసినట్లయింది. నెలకు యిరవై రోజులు హోటల్లోనే భోంచేసేవాళ్ళు. "హోటలు



భోజనం సహించడం లేదు. మా యింటి కెళ్ళి భోంచేసి వద్దాం" అన్నది లత ఓరోజు

"మీ యింటి కెళ్తే వంటవాడి వంటే. మా యింటికెళ్తే, మాపిన్ని చేతివంట తినవచ్చు. నీ యిష్టం" అన్నాడు కృష్ణమూర్తి.

లత మరి మాట్లాడ్లేదు. తర్వాత వంటవాణ్ణి పెట్టుకున్నారు. తర్వాత కొద్దికాలానికే కాలేజీలో కూడ చిరాకు ఎక్కువైంది లతకు.

'ఎక్కడ వేసిన కంబళి అక్కడే' నన్నట్లుగా వుండిపోయినవాళ్ళందరికీ, తమకన్న చిన్నవాడు, క్రొత్తవాడు అయిన

కృష్ణమూర్తి తమను మించి పైకి వెళ్ళడం, పైగా క్రొత్తగా అతనికి లభించిన భార్య చదువుకున్న సుందరాంగి కావడం, కృష్ణమూర్తి అంటే అసూయ పడేవాళ్ళు తక్కువలేరు యూనివర్శిటీలో. ఆ రకం వాళ్ళు అంతా లతకు వినపడేలాగ కృష్ణమూర్తిని విమర్శించడం అలవా టయింది. దండపాణి చేరదియ్యబట్టే కృష్ణమూర్తి పైపైకి వెళ్ళగలిగా డన్నది ఆ విమర్శల సారాంశం. అందరి దృష్టిలోనూ తనభర్త దండపాణి 'మలచినబొమ్మగా' కడకు అతని 'నీడ'గా అయిపోయినట్లు గుర్తించి నిర్ఘాంత పోయింది లత. కాస్తో కూస్తో 'అహం' అంటూ వున్న ఏ ఆడదానికైనా భర్త యింకొకరి 'నీడ' అనుకోబడడంకన్న తలవంపులు ఇంకోటి లేదు. మాటల్లో రెండు మూడుసార్లు "ఏమిటి ఎప్పుడూ దండపాణి గారిని పొగడడంకన్నా మీకు పనేం లేదేంటి?" అన్నది లత.

విననట్లూరుకుని మూడోసారి "లేకపోతే కర్మార్కర్‌గారిని పొగడమంటా వేమిటి, లతా? కర్మాకర్‌గారు నీకు తండ్రి మాత్రమే! దండపాణిగారు నాకు తండ్రిని మించినబాబాయి గురువు,దేవుడు. ఆయన్ను గురించి విరసనగా మాట్లాడి నన్ను నొప్పించినందువల్ల నీకు ఒరిగేది ఏమీ వుండదు. ఆసంగతి నువ్వు గుర్తుంచుకోడం మనిద్దరికీ మంచిది" అన్నాడు.

ఓ ఏడాది అలా గడిచింది. అభిమానం దెబ్బతిన్న లత ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా రోజులు గడుపుతోంది. ఒకయింట్లో అద్దెకున్నట్లుగా కలిసివుండడం తప్ప, స్నేహ సౌహార్ద్రాలు లోపించిపోయాయి. తత్ఫలితంగా లత తన డాక్టరేటుకు రాత్రింబవళ్ళు చదవగలిగింది. కృష్ణమూర్తికి లాబరేటరీ తప్ప ఇంక ప్రపంచం లేకుండాపోయింది. అటువంటిది హఠాత్తుగా కృష్ణమూర్తి కాలేజీకి సెలవ పెట్టాడు. ఇంట్లో ఉండలేకపోతున్నాడు. బైటకువెళ్ళలేకపోతున్నాడు. ఎప్పుడూ పక్కమీదో, పడకుర్చీలోనో పడుకుని ఆలోచన; వున్నట్లుండి లేవడం; ఏదో ఫైలు తీసి చూడడం; వెంటనే సర్వద్రష్టుడిలాగా కాగితాలు వదిలేసి మళ్ళీవెళ్ళి పడుకోడం!

లతఅడిగింది "ఏమిటీ, కాలేజీ కెళ్ళడం లేదూ?"

"ఒంట్లో బాగాలే" దన్నాడు ఎటో చూస్తూ.

"డాక్టరు దగ్గర కెళ్ళిరండి" అని ఒకటి రెండుసార్లు చెప్పింది. "మందు ఏమైనా వేసుకున్నారా" అని రెండుమూడుసార్లడిగింది. మళ్ళీ తన చదువు, కాలేజీ గొడవల్లోపడిపోయింది.

లత కాలేజీనుండి రాగానే వంటవాడు "అయ్యగారు భోంచెయ్య లేదమ్మా ఇవాళ; పదిసార్లు టీ త్రాగారు" అని ఫిర్యాదు చేసాడు. లత భర్త గదికి వెళ్ళి చూసింది. పడకుర్చీలో కళ్ళు మూసుకుని పడుకున్నభర్త, బల్లమీద ఖాళీఏష్ట్రే, బల్ల క్రిందా, కుర్చీక్రిందా కాల్చిపారేసిన సిగరెట్లు తెల్లబోయింది లత. దగ్గరకు వెళ్ళి భర్త ముఖంమీద చెయ్యి తొలగించి చూసింది. ఎంత సేపుగా అతని కళ్ళు వర్షిస్తున్నాయో, కణతలంతా తడిసివున్నాయి. కొన్నాళ్ళుగా కరుడుకట్టుకుపోయిన ఆమె మనసు, సెగ తాకిన లక్కలాగా కరిగిపోయింది. "మీ అనురాగం, మీ ఆదరణలకోసం నే నేమీ పడి చావడంలేదు" అన్నట్లుగా ప్రవర్తించిన లత కళ్ళనీళ్ళు కార్చే భర్తను చూచి తల్లడిల్లిపోయింది. ముఖాన్ని కొంగుతో తుడుస్తూ ఏమిటి మీ బాధ చెప్పరూ, నన్ను పంచుకోనివ్వరూ, చెప్పండి, లేకపోతే ఒట్టు, నామీద ఒట్టు!" అన్నది కరుణావేశం తరుముకు రాగా.

"నీ సేవలూ, సపర్యలూ లేకపోతే నా కేం లోటులేదు" అన్నట్లు ప్రవర్తించిన భర్త ఆక్షణం వెన్నలా కరిగిపోయి కన్నీళ్ళతో భార్యచేతులూ, చెంగూకూడ తడిపేశాడు.

ఆ క్షణం ఆ దంపతు లిద్దరికీ ఒక రకమైన బలహీనత ఏర్పడి అహం మించి 'ఒకరి కొకరు' అన్నట్లుగా తేరుకుంటూ బలవంతంగా పెగల్చుకుని ఆపిఆపి భార్యతో చెప్పాడు కృష్ణమూర్తి. "నా జీవితంలో యిటువంటి విషమపరిస్థితి నెదుర్కొంటానని అనుకోలేదు నేను. బాబాయి భిక్ష నా జీవితం. నా చేతులారా ఆయన కీర్తి నపహరించి నేను పేరు తెచ్చుకోలేను. కాని లతా- నా అంతరాత్మ నిజం దాయడానికే ఒప్పుకోడంలేదు. ఏం చెయ్యను - ఏం చెయ్యాలి. ఏం చెయ్యగలను నేను" అన్నాడు.

లత అయోమయంగా భర్తవంక చూస్తూ "విషయం సరిగ్గా చెప్పండి, నా కేమీ బోధపడలేదు" అంది.

"ఈ మధ్య నేను రాత్రింబవళ్ళు లాబరీటరీలో పడిన శ్రమంతా, 'పాణీ ఎఫెక్టు'- బాబాయి జీవితసర్వస్వం - తప్పని తేల్చుకోడానికి సరిపోయింది. కొన్ని ప్రత్యేకపరిస్థితులలో తప్ప ఆ సిద్ధాంతం పనికిరాదు. దాన్ని సరిగ్గా సంస్కరించి ప్రచురిస్తే శాస్త్రజ్ఞులలో బాబాయికి మిగిలేది అపహాస్యమే కాని కీర్తికాదు. శిష్యుడిగా, కొడుకుగా నా కర్తవ్య మేమిటో చెప్పు" అన్నాడు.

లత ఒకక్షణం మ్రాన్పడిపోయింది. ఆ విపరీత పరిస్థితిలో హఠాత్తుగా ఆమెలోనున్న స్వార్థచింత ప్రాణవాయువు పీల్చుకుంది. బల్లమీద కాగితాలు రెపరెప లాడినయి. తలెత్తి చూచింది లత. ఆమె కళ్ళు మెరిశాయి. వీటిమీద ముద్రించివున్న సూక్తులు "అసతోమా - సద్గమయ - తమసోమా - జ్యోతిర్గమయ" ఆమెను సమర్థించాయి. నెమ్మదిగా ఆ కాయితాలు ఎత్తి భర్త చేతి కందిస్తూ, "మామగారు జీవిత మంతా శాస్త్రజ్ఞుడిగా జీవించారు. ఆయన మీమీద పెట్టుకున్న ఆశ అదే! మీ కిచ్చిన ఆశీర్వాదం అదే! అయన మీకిచ్చిన సందేశమే అది. దాన్ని నెరవేర్చిననాడు ఆయన మీగురించి గర్వపడతారే తప్ప,



అపార్థం చేసుకోరు. నా కింతకన్నా ఏమీ తోచడంలేదు" అన్నది.

"అంతేనంటావా నేను చెయ్యవలసింది" అన్నాడు కృష్ణమూర్తి.

"ఔను, తర్వాతెప్పుడైనా వారికి, మీరు నిజం తెలిసే దాచారని తెలిస్తే మిమ్మల్ని ఎన్నటికీ క్షమించరు" అన్నది లత.

కరిగిన లోహం ఏమూసలో పోస్తే, ఆ ఆకారంలోనే రూపు దాలుస్తుంది. కృష్ణమూర్తి మనసు అట్లే పనిచేసింది. తర్వాత మూణ్ణెల్లకు ఓ ప్రఖ్యాత సైంటిఫిక్ జర్నల్లో అచ్చయింది కృష్ణమూర్తి వ్యాసం. కృష్ణమూర్తికి పత్రిక కాపీ అందగానే వణికిపోయాడు. కాలేజీలో వుండలేకపోయాడు.

ఇంటికెళ్ళి ముసుగు పెట్టి పడుకున్నాడు. పాపచింత లాంటి అనుభూతి దావాగ్నిలా దహించివేసిందతన్ని. యూనివర్శిటీలో ఫిజిక్సు డిపార్టుమెంటులోనే వున్న వృద్ధ జంబుకం నటేశన్‌కు యీ వ్యాసం చూడగానే, రెండుప్రక్కలా పదునుపెట్టిన కత్తి దొరికినట్లయింది. ఆతనికి దండపాణి అంటే పడదుగనుక కృష్ణమూర్తి అంటేనూ పడేది కాదు. ఇప్పుడు కంచే చేను మేస్తోంటే, నిల్చుని తమాషా చూడాలనిపించింది

అతనికి. పత్రిక చేత్తో పట్టుకుని దండపాణి గదిలో కెళ్ళి కూర్చుంటూ-

"దండపాణీ, నీ కిటువంటి అనుభవం కలుగుతుం దనుకోలేదయ్యా. పాముకు పాలు పోసి పెంచావు! నీ కెట్లా సానుభూతి చూపాలో తెలియడంలేదు" అన్నాడు.

"ఏమిటి మీరు మాట్లాడేది" అన్నాడు దండపాణి.

"ఇది చూడనేలేదా నువ్వు? చూడు — నే వస్తా'' అంటూ పత్రిక దండపాణి చేతి కిచ్చి తనపని ముగించుకు వెళ్ళిపోయాడు నటేశన్.

ఆ తర్వాత గంట సేపటికి ప్యూన్ ఏవో ఫైళ్ళు తీసుకుని వచ్చాడు. దండపాణి గదిలోకి. కుర్చీలో మూర్ఛిల్లి పడున్న దండపాణిని చూచి పరిగెత్తి నల్గురినీ పిల్చుకు వచ్చాడు. నీళ్ళు చల్లినవారు ఒకరు, డాక్టరును పిలిచినవారు ఒకరు, లేవనెత్తి పడుకోబెట్టి సపర్యలు చేసినవారు మరొకరు.

డాక్టరు వచ్చి ఏదో వాసన చూపించాడు. కాస్తంతగా కళ్ళు తెరిచాడు. ఇంజక్షన్ యిచ్చి "భయంలేదు. యింటికి తీసికెళ్ళండి" అని చెప్పి వెళ్లాడు. అక్కడున్న నలుగురూ పట్టి కారులో పడుకోబెట్టి యింటికి చేర్చారు.

"ఏమయ్యింది, ఎట్లా పడిపోయ్యారు? కృష్ణ దెక్కడ? వాడికి తెలియదా? కాస్త వాడికి కబురుపెట్టం డెవరైనా" అన్నది కంగారుపడిపోతూ శాంతమ్మ.

"అయ్యో, శాంతమ్మ తల్లీ, ఆ పనిమాత్రం చెయ్యకు. వచ్చే తెలివికూడ తప్పిపోతుంది, కృష్ణమూర్తి కనపడితే" నన్నారు ఒకరు.

శాంతమ్మ తెల్లబోయి "ఇదేమిటి?" అన్నది.

చిలువలు పలువలుతో చక్కటి కథ విని పించారు వచ్చిన శ్రేయోభిలాషులు. శాంతమ్మ హృదయంలో అత్యంత సుకుమారమైనచోటనే తగిలింది ఆ ఘాతం. కృష్ణమూర్తిపైన పెంచుకున్న మాతృత్వపు మమకార మంతా క్షణంలో మాయమైంది. మాటాపలుకూ లేకుండా మంచంమీద పడివున్న భర్తపక్కనే కూలబడి నిశ్శబ్దంగా రోదించసాగింది శాంత.

దండపాణి మధ్య మధ్య కళ్ళు విప్పి చూడడమేకాని ఎంత పలకరించినా బదులు మాత్రంలేదు. స్పెషలిష్టులు వచ్చి పరీక్ష చేసి "మెదడుకు తగిలిన షాక్ బలమైనది. క్రమంగా కోలుకుంటే మాట రావచ్చును. ఈ వయస్సులో షేము చెయ్యగల్గిం దేమీ లేదు" అని చెప్పారు. ఈ వార్త వూరంతా పాకింది.

"వెళ్ళి చూడవద్దూ" అంది లత భర్తతో.

"నువ్వెళ్ళిరా, నే నేముఖం పెట్టుకు వెళ్తాను" అన్నాడు ఏడుస్తూ కృష్ణమూర్తి.

"లతను చూసిన శాంతమ్మ సహనాన్ని కోల్పోయింది." ఏం ఇంకా వూపిరి వుందా, లేదా అని చూసిరమ్మని పంపాడా నీభర్త? ఏం చూడ్డానికి వచ్చావు?" అని అరిచింది.

ఐదు నిముషాల్లో తిరిగివచ్చిన లతను చూసి "ఏమి జరిగింది" అనడిగాడు కృష్ణమూర్తి.

లత మాట్లాడలేదు. ఆ రాత్రి దీపాలు పెట్టిన రెండు గంటలకు బయల్దేరి దండపాణి యింటికి వెళ్ళాడు కృష్ణమూర్తి. ఏడేళ్ళు ఆ యింటి సర్వస్వంగా మెలిగిన ఆతడు యీ రోజు ఓ పరాయివానిలాగ కూడకాదు, ఓ దొంగలాగ యింట్లోకి భయం భయంగా నడిచాడు. దండపాణి గదిలోకి వెళ్ళాడు. ఆ సమయానికి శాంతమ్మ లేదక్కడ. పిల్లిలాగ అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు. దండపాణి కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

కృష్ణమూర్తి గొంతు పెగల్చుకుని "బాబాయ్" అన్నాడు.

పిలుపు వినబడిందో లేదో, దండపాణి కళ్ళుతెరిచి కృష్ణమూర్తిని చూచాడు. ఆయన కళ్ళు నిండిపొయ్యాయి నీళ్ళతో. చప్పున ముఖం అటుత్రిప్పుకుని తిరిగికళ్లుమూశాడు.

"బాబాయ్ — బాబాయ్" అన్నాడు కృష్ణమూర్తి. దండపాణి మళ్ళీ కళ్ళు తెరవ లేదు. 'ఛీ. ద్రోహీ, నీ ముఖం చూపకు' అని ఆయన అన్నట్లు తోచింది కృష్ణమూర్తికి.

చిన్నవాళ్ళ ముందర, జీవితంలో సాధించా ననుకున్నది, గర్వింప దగ్గది

కోల్పోయిన సిగ్గు భరించలేక కళ్ళు మూసుకున్నాడు దండపాణి.

అంతలో అక్కడకు వచ్చిన శాంత కృష్ణమూర్తిని చూచి కాళికైపోయింది. "ఎవరది, నువ్వా? ఎందుకు వచ్చావ్? తల్లిలాగ ప్రేమించినందుకు, నా సౌభాగ్యానికే మచ్చ తెస్తావా? వెళ్ళు యిక్కడనుంచి; నాముందు నిలవకు; నన్ను రెచ్చకొట్టకు" అని అరిచింది.

కృష్ణమూర్తి శాంతమ్మను శాంతమ్మగానే ఎరుగును. ఆమె ఉగ్ర స్వరూపాన్ని మొదటిసారి ఆనాడే చూచాడు. తలవంచుకు బైటకు వెళ్ళాడు.

ఇంటికి వెళ్ళాక లత "ఏమండీ,ఏమిటి?" అని పలుకరించింది.

వినిపించుకోలేదు కృష్ణమూర్తి. గదిలోకి వెళ్ళి గడియ వేసుకున్నాడు. భర్తను భోజనానికి పిలవడానికి గూడ భయపడింది లత. మెదలకుండా వెళ్ళి పడుకుంది. నిద్ర పట్టేశింది. తెల్లవారి లేచి భర్త గదిలోకి వెళ్ళింది. కృష్ణమూర్తిలేడు మంచంమీద. దిండుకు గుచ్చిన వుత్తరం వెక్కిరిస్తూ కనబడింది. గుండె దడదడలాడగా తీసి చదువుకుంది.

"లతా!

నాకోసం బెంగపడకు. నా ఆధారం లేకపోయినా నువ్వు బ్రతగ్గలవని తెలుసు నాకు. నా కోసం వెతికించకు. మరి నీకు కనపడని దూరానికి పోతున్నాను. నీకు చెప్పిపోగల సంగతులుగాని, అప్పగించి పోగల ఆస్తులు గాని నావద్ద లేవు. నా లెటర్‌పాడ్‌లో మిగిలిన కాయితాలు మాత్రం నీ కిచ్చిపోతున్నా. దాచుకో! మరిచిపో నన్ను!

కృష్ణ"

ఉత్తరానికి జతచేసి పెట్టిన తెల్లకాయితాలు చూచింది లత. వణికిపోయింది వాటిని చూసి. కాయితాలు చేత పట్టుకుని "అసతోమా — అసతోమా" అంటూ అస్పష్టంగా గొణుక్కుంటూ వుండిపోయింది. ఎవరేమి అడిగినా ఇంకేమీ బదులు చెప్పలేదామె!